క్లుప్తంగా

6న కోకో రైతుల చలో ఏలూరు


మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6న ఉదయం 10 గంటలకు కోకో రైతుల సమస్యలపై చలో ఏలూరు పేరుతో కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.900 ధర ఉన్నా.. రూ.500 నుంచి రూ.650 మాత్రమే ధర ఇవ్వడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అన్ని గ్రామాల నుంచి కోకో రైతులు ఏలూరు తరలి వచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కోకో రైతు సంఘం నాయకులు పానుగంటి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావును పరామర్శించిన జేపీ


వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జేపీ తదితరులు

ఏలూరు (టూటౌన్): అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆచంట వెంకటేశ్వరరావు చిన్న కుమార్తె ఆచంట ప్రియాంక (26) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) మంగళవారం వెంకటేశ్వరరావును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి ధైర్యం చెప్పారు. వెంకటేశ్వరరావును బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నేరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గుర్నాథ్, నాయకులు కొల్లిపాక సురేష్, కొలికిపాముల తిరపతి తదితరులు పరామర్శించారు.

పారదర్శకంగా ఉపాధి పనులు


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలక్ష్మి

గణపవరం: ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా నిర్వహించాలని, పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీఓ బీబీ శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం గణపవరం మండల కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులపై 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. అన్ని విభాగాలతోటి ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా ఈ సమన్వయ సమావేశం నిర్వహించారు. మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మండల ఇంజినీరింగ్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్స్, సీనియర్ మేట్స్ పాల్గొన్నారు.

హోలీల్యాండ్‌లో అద్భుత ఘట్టాలు



పవిత్ర భూమి నమూనా


పశువుల పాకలో ఏసు జననం


సముద్ర అలలను గద్దించిన ఏసు

పెదవేగి: ఏసు క్రీస్తు నడయాడిన పవిత్ర స్థలాలన్నింటినీ కళ్లకు కట్టినట్టు చూపుతోంది హోలీ ల్యాండ్. దీనిని పునీత అన్నమ్మ సత్యోపదేశ సంస్థ ఆధ్వర్యంలో పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో ఏర్పాటుచేశారు. జెరుసలేం వెళ్లి పవిత్ర స్థలాన్ని దర్శించలేని వారు ఈ హోలీల్యాండ్‌ను సందర్శించి తమ భక్తిప్రపత్తులను చాటుకుంటారు. బుధవారం నుంచి 40 రోజుల పాటు క్రైస్తవ దీక్ష పూనిన వ్యక్తులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోపాటు కేరళ, తమిళనాడు, కర్ణాటక, ముంబాయి ప్రాంతాల నుంచి విశ్వాసులు అధిక సంఖ్యలో విచ్చేసి ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు, సిలువ మార్గం చేస్తుంటారు. ఆవరణలో ఉన్న ధ్యాన కేంద్రంలో ఏకాంత ప్రార్థనతో మంచి ఫలితాలు పొందుతారు. ఈ పవిత్ర స్థలాన్ని ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సందర్శించవచ్చు. ప్రతి మంగళవారం సెలవు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 99496 78272లో సంప్రదించవచ్చని హోలీల్యాండ్ డైరెక్టర్ సిస్టర్ ఇన్యాసమ్మ తెలిపారు. ఫాదర్ సిల్వియో పాస్కులి పీఐఎంఈ సంస్థ గురువుచే పునీత అన్నమ్మ సత్యోపదేశ సభ స్థాపించి 2014కి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ హోలీ ల్యాండ్ నమూనాను నిర్మించామని చెప్పారు.


యాకోబు బావి వద్ద స్త్రీతో మాట్లాడుతున్న ఏసుక్రీస్తు


కానా పెళ్లి విందులో నీటిని ద్రాక్షా రసంగా మార్చిన ఏసు


క్రీస్తుకు ముళ్ల కిరీటం పెట్టే దృశ్యం


ఏసు సిలువ మోయుట


ఏసు తన తల్లిని యోహానుకు అప్పగించే దృశ్యం

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి


పెదవేగి : నడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న మేరీ బాయమ్మ

ఏలూరు (టూటౌన్): పౌష్టికాహారంతోనే మహిళలు ఆరోగ్యంగా ఉంటారని ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. ఏలూరు ప్రాజెక్టు పరిధిలో ఉన్న పుష్పలీల నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన హ్యాపీ అండ్ హెల్దీ ఉమెన్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలందరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని సూచించారు. పిల్లలకు కూడా పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా మిల్లెట్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంగ, అంగన్‌వాడీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లోనూ ముందుండాలి

పెదవేగి : మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని విజయరాయి అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ కె.మేరీ బాయమ్మ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెదవేగి మండలం నడిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో మేరీ బాయమ్మ మహిళ గొప్పతనం, ఆమె ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తను వివరించారు. అంగనవాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై అంగన్‌వాడీ టీచర్లు చేసిన పలు రకాల పిండి వంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోషకాహార ప్రదర్శన

పెదపాడు : మహిళలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను వినియోగించాలని సూపర్‌వైజర్ షేక్ ఫాతిమా మున్నీషా బేగం సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం పెదపాడు అంగన్‌వాడీ కేంద్రం -5లో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. తొలుత యోగాసనాలపై అవగాహన కల్పించారు. యోగ వల్ల కలిగే ఉపయోగాలు, ఆకు కూరలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వివరించారు.

చిరుధాన్యాలు కీలకం

దెందులూరు: పోషకాహారంలో చిరుధాన్యాలు కీలకమని ఐసీడీఎస్ పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. మంగళవారం పోతునూరు సెక్టార్ పరిధిలోని కొమరేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీ, సహాయకులు లక్ష్మి పాల్గొన్నారు.

దళిత యువకుల ఆందోళన


ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో రోడ్డుపై గుమ్మికూడిన దళిత యువకులు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపివేశారంటూ కొందరు దళిత యువకులు మంగళవారం రాత్రి ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దాంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయం వద్ద దళిత యువకులు అంబేడ్కర్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అలాగే ఆ ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు దిమ్మను నిర్మిస్తున్నారు. అయితే ఫ్లెక్సీని చింపివేశారంటూ యువకులు ఆందోళనకు దిగారు. గ్రామ సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజుతో పాటు, మరి కొందరు రోడ్డుపై బైఠాయించారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు దిమ్మను నిర్మిస్తుంటే కొందరు అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై టి.సుధీర్ ఆందోళన కారులను బుజ్జగించారు. అనుమతులు పొందిన తరువాత విగ్రహ ఏర్పాటుకు దిమ్మను నిర్మించుకోవాలని సూచించారు. ఫ్లెక్సీని ఎప్పటిలాగే పెట్టుకోమని తెలిపారు. దాంతో ఆందోళన సద్దుమణిగింది.

ఘనంగా లైన్‌మేన్ దివస్


సన్మానం పొందిన లైన్‌మేన్‌లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ లైన్‌మేన్ దివస్‌ను ఏలూరు విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథి విద్యుత్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ నిరంతరం 24 గంటలు 365 రోజులు వినియోగదారుల సేవలో కష్టపడి పనిచేస్తున్న లైన్ స్టాఫ్ అందరికీ లైన్‌మేన్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. లైన్‌మేన్ దివస్ అవార్డులు అందుకున్న లైన్‌మేన్లను సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈలు కేఎం అంబేడ్కర్, పీఏ ఖాన్, పి.రాధాకృష్ణ, టి.శశిధర్, కె.శ్రీనివాస్, విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు తురగా రామకృష్ణ, ఎం రమేష్, ఎస్ బలుసు బాబు, జీఎవీ పాల్, అబ్బాస్, ఏడీఈలు ఎ.రమాదేవి, ఎస్ సుజాత, టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

పోలవరం రూరల్: తల్లిదండ్రులు పిల్లల నడవడిక, అలవాట్లు, ప్రవర్తనపై నిశితంగా పర్యవేక్షించాలని ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ సూచించారు. పట్టిసం పంచాయతీ పరిధిలోని బంగారంపేటకు చెందిన బాలుడు కళ్లేపల్లి మేఘసాయి అశ్వత్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కొన్ని గంటల వ్యవధిలోనే ఆ బాలుడిని గుర్తించారు. పోలీస్‌స్టేషన్ వద్ద బాలుడిని తల్లితండ్రులకు అప్పగించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

ఆందోళనకారులతో డీవైఈఓ చర్చలు

కొయ్యలగూడెం: ఎంపీయూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా మార్చాలని ఆందోళన చేస్తున్న దిప్పకాయలపాడు గ్రామస్తులతో డీవైఈవో రామన్న దొర మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి చర్చించారు. ఎంపీయూపీ స్కూల్‌ను హైస్కూల్ గా మార్చడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించడంతోపాటు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని అప్పటి వరకు తరగతులను నిర్వహించాల్సిందిగా కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ఎంపీయుపీ స్కూల్‌లోని ప్రైమరీ తరగతులను గొల్లగూడెంలోని ఉన్న ఎంపీపీ స్కూల్‌లో విలీనం చేయడానికి గల అంశాలను పరిశీలించారు. కాగా ప్రస్తుత పాఠశాలలోని ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు కన్నాపురం హైస్కూల్‌లో విలీనానికి ఎట్టి పరిస్థితులలోనూ ఒప్పుకోమని గ్రామస్తులు ముక్తకంఠంతో డీవైఈఓకి సూచించారు. సర్పంచ్ సున్నం శాంతకుమారి, కాకర్ల నంది, దుగ్గిరాల పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	39
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.0	4830	33
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31

ఆరోగ్య, ఆశ కార్యకర్తల భాగస్వామ్యం కీలకం


మాట్లాడుతున్న మలేరియా అధికారి ప్రసాద్

దెందులూరు: అంటువ్యాధులను అరికట్టడంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తల భాగస్వామ్యం కీలకమని ఏలూరు జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు రాకేష్, రోజా ఆధ్వర్యంలో దెందులూరు మండలం గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆశ డే కార్యక్రమం నిర్వహించారు. ఎక్కువ రోజులు మంచినీటి నిలువ ప్రాంతాలు క్లీన్ చేసుకోకపోవడం వల్ల డెంగీ దోమ మంచినీటి నిల్వ ప్రాంతాల లలో గుడ్లు పెడుతుందని తెలిపారు. ఇంటి పరిసరాల్లో డ్రమ్ములు, తొట్టెలు, పూల కుండీలు, రుబ్బురోలు, ఎయిర్ కూలర్స్, పల్లపు నీటి నిల్వ ప్రాంతాల వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ ప్రజలు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రోజా, శశాంక్, బాలకృష్ణ, కేతా సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు మార్తమ్మ, హైమావతి పాల్గొన్నారు.

కర్రనాచు తొలగింపు పనులు

భీమడోలు: గోదావరి కాల్వలో పేరుకుపోయిన కర్రనాచు, గుర్రపు డెక్కలను తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగు నీటి సమస్యకు కారణంగా ఉన్న వాటిని తొలగించే పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా నీటి ప్రవాహం కిందకు పారక సాగు, తాగు నీటి ఇబ్బందులు తలెత్తాయి. కాల్వలో కైకరం, పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు వరకు నీరు ప్రవాహానికి అడ్డుగా ఉన్న కర్ర నాచును ప్రత్యేక పడవలతో తొలగిస్తున్నారు. గుండుగొలను జలవనరుల శాఖ సెక్షన్ పరిధిలోని ఏఈ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఐజీ ఆర్‌వీ సత్యనారాయణ, లస్కర్లు, సిబ్బంది పనులు చేపట్టారు. ఇక్కడ నీటి మట్టం సుమారు 3.5 అడుగులకు పెరిగితే గుండుగొలను, దెందులూరు మండలాలకు సాగునీరు చేరుతుంది. ఈనెలాఖరు నాటికి పంట చేతికందే దశలో ఉన్నందున చివరి తడులు పడకపోతే వేలాది ఎకరాల్లోని పంట దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. అయితే అధికారులు నీటి మట్టం పెంచేందుకు పనులు వేగంగా నిర్వహిస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెం అంబేడ్కర్ నగర్, రాజీవ్ నగర్ కాలనీ వాసులకు చెందిన శ్మశాన వాటికకు సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు బోరు, షెడ్ నిర్మించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సంఘ నాయకులు మంగళవారం శ్మశాన వాటిక వద్ద నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ అంబేడ్కర్ కాలనీలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు చేయడానికి సరైన రోడ్డు మార్గం లేక అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శ్మశాన వాటికకు ఏర్పాటు చేసిన రహదారికి తుప్పలు పేరుకుపోవడంతో పాటు ఆక్రమణకు గురైందని దీనిపై సర్వే చేసి న్యాయం చేయాలన్నారు. అదే విధంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు బోరు వేయాలని, షెడ్‌ను కూడా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బి.డేవిడ్‌రాజు, గొల్లపల్లి వెంకటేశ్వరరావు, కోండ్రు కార్తిక్, గంధం ఇజ్రాయేలు, పేతురు, కొదం ఆనంద్, నిట్టా రవి, గంగాధర్ రావు, గంజి ఏలియా, తదితరులు పాల్గొన్నారు.